# పోరుగడ్డపై ప్రగతి జాడ



కుమ్రం భీం స్మృతి చిహ్నం




గత పాలకులు జోడేఘాట్‌లో ఏర్పాటు చేసిన భీం విగ్రహం



బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిలువెత్తు కాంస్య విగ్రహం

*జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం సల్పిన కుమ్రం భీం పురిటిగడ్డ జోడేఘాట్‌లో ప్రగతి పరవళ్లు తొక్కుతున్నది. సమైక్య రాష్ట్రంలో ఆదరణకు నోచుకోని ఈ ప్రాంతం స్వరాష్ట్రంలో సరికొత్త అందాలతో రూపు రేఖలు మార్చుకున్నది. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. గిరిజన మ్యూజియం, స్మారక చిహ్నం, కుమ్రం భీం విగ్రహంతో పాటు రెండువరుసల రహదారి నిర్మించింది. ఇక ఏటా కుమ్రం భీం వర్ధంతి కూడా అధికారికంగా నిర్వహిస్తుండగా, అశేష జనవాహిని హాజరవుతున్నది.*

*–కెరమెరి, అక్టోబర్ 25*




జోడేఘాట్‌లో జల్, జంగల్, జమీన్ ఆర్చిలతో నిర్మించిన ముఖద్వారం

- **సమైక్యరాష్ట్రంలో కానరాని అభివృద్ధి ఆనవాళ్లు**
- **స్వరాష్ట్రంలో పర్యాటకశోభ**
- **జోడేఘాట్ కు కొత్తందాలు**
- **మ్యూజియం, విగ్రహం ఏర్పాటు**
- **రెండు వరుసల రహదారి నిర్మాణం**
- **ఘనంగా పోరాటయోధుడి వర్ధంతి**
- **తరలివస్తున్న సందర్శకులు**

ఆదివాసీ పోరాట వీరుడు కుమ్రం భీం నడియాడిన గడ్డ జోడేఘాట్ స్వరాష్ట్రంలో పర్యాటకంగా సందర్శకులను ఆకట్టుకుంటున్నది. గత ప్రభుత్వాలు ఈ ప్రాంతంపై నిర్లక్ష్యధోరణి అవలంబించడంతో సమస్యలు పలకరించేవి. సరైన రోడ్డు సౌకర్యం కూడా లేక, ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కనీసం విద్యుత్ సరఫరా సక్రమంగా లేక అంధకారంలో గడిపిన క్షణాలు ఉండేవి. ఇక జోడేఘాట్ గ్రామాన్ని కూడా వీడేందుకు అక్కడి ప్రజలు సిద్ధపడ్డారు. కనీసం పోరాటయోధుడి వర్ధంతిని కూడా పట్టించుకోని పరిస్థితి నాడు ఉండేది. గిరిజన దర్బార్‌కు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను రానివ్వకుండా నాటి ప్రభుత్వం కట్టడి చేసింది. ఈ నేపథ్యంలో భీం వారసులతో కలిసి కేవలం కొద్దిమంది ఆదివాసులే వర్ధంతిని నిర్వహించాల్సిన పరిస్థితి ఉండేది.

**• రూపురేఖలు మారిపోయాయిలా..**

ఇక నాడు కుమ్రం భీంతో పాటు మరో 14 మంది ఉద్యమకారులు ఆమరులైన వారి పేరిట స్థూపం ఏర్పాటు చేయాలని 2013లో ఆదివాసీ నాయకులు చేసిన డిమాండ్ మేరకు అప్పటి కలెక్టర్ అహ్మద్‌బాబు, ఐటీడీఏ పీవో జనార్దన్ నివాస్ నేతృత్వంలో భీం సమాధి పక్కన 15 మంది ఉద్యమకారుల పేర్లతో కూడిన 15 అడుగుల స్థూపం నిర్మించారు. అనంతరం 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో రాగానే తొలి ఏడాదే ముఖ్యమంత్రి భీమ్ వర్ధంతికి హాజరవుతున్న సందర్భంగా స్థూపం పక్కన అదనంగా మరో ఆకర్షణీయమైన భీం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీమ్ వర్ధంతికి హాజరై గిరిజన దర్బార్‌లో పోరుగడ్డకు రూ. 25 కోట్లతో పర్యాటక అభివృద్ధి కోసం వరాలు కురిపించారు. హామీ మాత్రమే కాకుండా సకాలంలో నిధులు విడుదల చేయడంతో జోడేఘాట్ అభివృద్ధి పనులకు బీజం పడింది. పోరాట వీరుడికి ఘనకీర్తి లభించేలా భీం స్మృతి చిహ్నం, గిరిజన స్మారక మ్యూజియం నిర్మించారు. రెండు వరుసల బీటీ రహదారి నిర్మించి పర్యాటక ప్రాంతంగా మార్చి వేడుకలకు జోడేఘాట్ మరో వేదికగా మారింది.

**• రాష్ట్రం ఏర్పాటుతో జోడేఘాట్‌కు గుర్తింపు..**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి, 2014లో టీఆర్ఎస్ సర్కారు అధికారంలో రాగానే అభివృద్ధి పనులకు పునాది పడింది. ముఖ్యమంత్రిగా ఎన్నికైన మొదటి సంవత్సరంలోనే సీఎం హోదాలో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రావడంతో పోరుగడ్డ దశ మారింది. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రూ. 15.70 కోట్లతో డబుల్ తారురోడ్డు, నిరంతరం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు వంటి కనీస సౌకర్యాలను కల్పించింది. మ్యూజియంలో ఆచారాలు, సంస్కృతీసంప్రదాయలు ఉట్టి పడేలా చిత్రాలు ఏర్పాటు చేయడంతో పాటు గుస్సాడీ నృత్యాలు, ఇతర పండుగలతో పాటు ఆదివాసీలు పూజించే దేవతలు ఇలా పుట్టినప్పటి నుంచి మరణించే వరకు చేసే కార్యక్రమాలు కళ్లకు కట్టినట్లు చిత్రాలతో ప్రదర్శించారు. తెలంగాణ సర్కారు చేసిన అభివృద్ధి పనులతో ఆ ప్రాంతం పర్యాటకంగా ప్రగతి బాటపట్టడంతో చూసేందుకు రాష్ట్ర ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకుల సందడి పెరిగింది. కుమ్రం భీం పేరు, ఖ్యాతి ప్రపంచస్థాయికి చేరేలా బీఆర్ఎస్ సర్కారు పాటుపడింది.

# పెర్కపల్లిలో క్షుద్ర పూజల కలకలం..

తిర్యాణి,అక్టోబర్ 25: మండలంలోని నాయకపుగూడ పంచాయతీ పరిధిలోని పెర్కపల్లి గ్రామంలో బుధవారం క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి.గ్రామస్తుల వివరాల ప్రకారం.. పెర్కపల్లి గ్రామానికి చెందిన మంచేర్ల లక్ష్మి అనే అంగన్‌వాడీ ఆయా ఇంటిముందు గుర్తుతెలియని వ్యక్తులు రంగుతో కూడిన బియ్యాన్ని పోశారు. అందులో రెండు పిండితో చేసిన బొమ్మలు ఉంచారు. వాటిపై అగర్బత్తులు వెలిగించారు. ఇటీవల కూడా ఇదే గ్రామంలోని రైతుల ఇళ్ల ముందు సైతం గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలకు సంబంధించిన రంగు బియ్యం,నిమ్మకాయలు ఇతర సామగ్రితో కలకలం సృష్టించారు. గత కొద్ది రోజుల తర్వాత ఇలాంటి ఘటన తిరిగి పునరావృతం కావడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా బాధితురాలు తెలిపిన ప్రకారం.. తన కొడుకు చేను కావలికి వెళ్లి తిరిగి రాత్రి 2గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. తనను నిద్రలోంచి లేపాడు.తలుపు తెరచి ఇంటిలోకి వచ్చే సరికి ఇంటిముందు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రంగుతో కూడుకున్న బియ్యాన్ని ఉంచి అందులో రెండు బొమ్మలు పెట్టి అగర్బత్తులు వెలిగించే ప్రయత్నం చేస్తుండగా తమను గమనించి పారిపోయాడని తెలిపారు. గతంలో కూడా తన ఇంటి ముందు ఇలాంటి పూజలు జరిపినట్లు తెలిపారు. దీంతో ఇంట్లోని వారందరికీ ఆరోగ్యాలు బాగోలేక తన భర్త మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా మూఢ నమ్మకాల వైపు మళ్లేలా చోటు చేసుకుంటున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ పెద్దలతో పాటు పోలీసులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు.



రంగు బియ్యం,నిమ్మకాయలు ఇతర సామగ్రితో క్షుద్రపూజలు నిర్వహించిన దృశ్యం

## మందమర్రిలో బీఆర్ఎస్
# ఎన్నికల ప్రచారం



ప్రభుత్వ పథకాలపై కళాకారుల ఆటపాటలను తిలకిస్తున్న ప్రజలు




మందమర్రిలో ప్రచారం చేస్తున్న కళాకారులు

- **ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కళాకారులు**

మందమర్రి, అక్టోబర్ 25 : ఎన్నికల నేపథ్యంలో మందమర్రి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కళాజాత కళాకారులు తమ గేయాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ఆయా వార్డుల్లో తిరుగుతూ జనకూడలి ప్రదేశాల్లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోలోని హామీలను తమ గేయాల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఫిల్టర్ బెడ్ ఏరియా, ప్రాణహిత కాలనీల్లో బుధవారం ప్రచారం చేశారు. ప్రచార వాహనం వద్దకు చేరుకుంటున్న ప్రజలు కళాకారుల ఆటపాటలను తిలకిస్తున్నారు. మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా అమలు చేస్తున్న పథకాలతో పాటు చెన్నూర్ నియోజకవర్గంలో విప్ బాల్క సుమన్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటేసి బాల్క సుమన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.